అత్తమ్మా వాళ్ళు వచ్చే ముందురోజు సుందరి దగ్గర్నుండి ఫోను వచ్చింది. తను చెప్పిన వార్త వింటూనే కుప్పకూలిపోయాను. పక్క ఊరిలో..రాజు అక్కడికి ఎందుకెళ్ళాడో తెలియదు... యాక్సిడెంట్ అయిందని ఎవరో చూసిన వాళ్ళు ట్రాక్టర్‌లో తీసుకొచ్చారు. రాజు మరణానికి ఊరు ఊరంతా ఒక్కటిగా రోదిస్తున్నారని సుందరి చెప్పింది.

పెళ్ళిని వచ్చే జన్మకు వాయిదా వేస్తావా? అని నేను సరదాగా అన్న మాటల్ని రాజు నిజంగానే నిజం చేసి వెళ్ళిపోయాడా..?! ఆ నమ్మలేని నిజాన్ని తట్టుకోలేకపోయాను. గదిలో ఒంటరిగా రోదిస్తూ ఉండిపోయాను.

అత్తమ్మా వాళ్ళు వచ్చేశారు.

నన్ను చూసి "దిగులు పెట్టుకున్నావా.. ఇలా అయిపోయావేంటి" అంటూ అత్తమ్మ డాక్టర్ని పిలిపించి హడావుడి చేసింది. మామూలు నీరసమే తప్ప ఇంకేం లేదని డాక్టర్లు చెప్పే వరకూ స్థిమితపడలేదు. ఇంకెప్పుడూ నన్ను ఇంట్లో ఒదిలి వెళ్ళననీ, వెళ్ళాల్సి వస్తే నన్నూ వెంటబెట్టుకుని వెళ్తానంటూ అత్తమ్మ చెబుతోంటే.. నేను నిశ్శబ్దంగా లోలోన కుమిలిపోయాను.

తర్వాత సుందరి తమ్ముడు హరి ఫోను చేసి ఇంకో భయంకరమైన నిజం చెప్పాడు. రాజుది యాక్సిడెంట్ మరణం కాదు... చం..ప..బ..డ్డా...డు..!! రాజుని కిరాతకంగా హత్య చేయించిందెవరో కాదు బావా.. మా నాన్నే!

ఆరోజు ఊళ్ళో అందరూ నూకాలమ్మ జాతరలో హడావుడిగా ఉన్నారు. గుంపులో ఉన్న రాజుకు ఎవరో వచ్చి ఏదో చెప్పటం... రాజు హడావుడిగా ఎక్కడికో వెళ్ళడం హరి చూశాడుగానీ అప్పుడు దాని గురించి ఆలోచించలేదు. హరికి వాళ్ళమ్మ మామిడాకులు తెమ్మన్న విషయం గుర్తొచ్చి మునసబు గారి తోటకు వెళ్ళాడట. అక్కడ చెట్టెక్కి కూర్చున్న హరి.. దూరంగా మరిడమ్మ బావి దగ్గర కనుపించిన దృశ్యాన్ని చూస్తూనే భయంతో బిగిసుకుపోయాడు. ఎవరో పొరుగూరు మనుష్యులు ఆరేడుగురు

మూకుమ్మడిగా కర్రలతో దాడిచేసి.. ప్రాణాలు తీసి.. రాజు నిర్జీవ శరీరాన్ని జీపులో వేసి తీసుకెళ్లిపోయారట! వణికిపోతూ చెట్టుమీదే చాలా సేపు ఉండిపోయిన హరి ఇంటికెలాగో వచ్చాడు గానీ ఎవరికీ ఆ విషయం చెప్పలేదు.

రాజు యాక్సిడెంట్‌లో మరణించాడని ఊరందరూ రోదిస్తున్న సమయంలోనే నాన్న దగ్గిర నిలబడి రాజును చంపిన వాళ్ళు నాన్నతో మంతనాలు ఆడటం హరి గమనించాడు. వాళ్ళని గుర్తుపట్టాడు. కానీ భయంతో నోరు పెగలక ఎవరికీ.. ఆఖరుకు ఇంట్లో వాళ్ళకి కూడా చెప్పలేకపోయాననీ నాతో బెక్కుతూ చెప్పాడు. నాన్న ఎందుకంత దారుణానికి ఒడిగట్టాడో నాకర్థమైంది! రాజు బ్రతికి ఉంటే నేనెప్పటికీ మరొకరితో పెళ్ళికి అంగీకరించననే ఉద్దేశ్యంతోనే అలా చేశాడు.

అత్తమ్మకీ విషయం ఎలా చెప్పాలీ అని నేను సతమతమవుతూండగానే నీ దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. నువ్వు 'సుజన' అనే అమ్మాయిని ఇష్టపడుతున్నాననీ, పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాననీ రాశావ్. షాక్ తగిలినట్లుగా అత్తమ్మ తల్లక్రిందులైపోయింది! ఆ సమయంలో రాజు సంగతి, నాన్న విషయాలూ చెప్పలేని అశక్తతతో అత్తమ్మ ఒడిలో తలపెట్టుకుని మనసారా ఏడ్చేశాను. అత్తమ్మ నా దుఃఖాన్ని మరొక విధంగా అర్థం చేసుకుంది. నువ్వు తమాషాగా రాసి ఉంటావని, నన్నుతప్ప వేరొకర్ని కోడలిగా అంగీకరించనని నన్ను ఊరడిస్తుంటే... నా దుఃఖం ఇంకా ఎక్కువైపోయింది.

గదిలోకి వచ్చి.. ఒంటరిగా కూర్చుంటే.. అద్దంలో ప్రతిబింబం కనుపించగానే రాజు మాటలు గుర్తుకొచ్చాయి.

"అన్నం తినగానే ఆకలీ... నీళ్లు తాగగానే దాహం తీరతాయి గానీ నా కనుల ఆకలి దప్పులు మాత్రం నిన్ను చూడగానే తీరకుండా ఇంకా ఇంకా పెరుగుతూండటానికి కారణమేమిటబ్బా.. " అంటూ నవ్వాడొకసారి.

మామయ్య నాకెప్పుడో తెచ్చిచ్చిన రేడియో కమ్ టేప్‌రికార్డర్‌ని నేనెప్పుడూ ఇంట్లో కూడా నా వెంటే తిప్పుకుంటానని ఒకసారి రాజుతో అంటే... ఇక ముందు అదేం కుదరదన్నాడు. అదేమని అడిగితే ఎప్పుడూ నా వెంట తనే ఉండి పాటలు పాడి వినిపిస్తూంటాననే ఉద్దేశ్యంతో "సమీర్ రాజు అనే రేడియో స్టేషన్ సదా శ్రీమతి శ్రీలక్ష్మి కోరిన పాటల్నే వినిపిస్తుంటుంది మరి.." సరదాగా అన్నాడు.

"సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం... దేనిలో నువ్వెక్కువ పేరు తెచ్చుకోవాలని అనుకుంటున్నావ్?" అని ఒకసారి నేనడిగినప్పుడు "శ్రీలక్ష్మిని ఆరాధించే గొప్ప ప్రేమికుడుగా.. ప్రేమ శాస్త్రంలో రీసెర్చి చేసి పేరు తెచ్చుకోవాలనుకుంటున్నాను.." సీరియస్‌గా చెప్పి నన్ను నవ్వించాడు.

ఇలా అనుక్షణం రాజు జ్ఞాపకాలు వెల్లువెత్తుతూంటే... నేను నిలకడగా ఎలా నిలబడగలను బావా..?!

ఊహూ.. నా వల్ల కాదు.. నిజం! రాజు మరణానికి నేను, నా ప్రేమే కారణమనే అపరాధ భారాన్ని మోస్తూ ఎలా బ్రతకగలను...? అసలు బ్రతికే హక్కునే పోగొట్టుకున్నాననిపించింది! కారణం.. నాన్నే! ముమ్మాటికీ నాన్న మాత్రమే కారణం! మనం ఈ భూమ్మీదకు రావటంలో మన ప్రమేయం ఉండదు. నిష్క్రమించటంలోనూ ఉండకూడదు! ఆత్మహత్య పాపమనే పెద్దల మాటను విశ్వసించే నేను... ఇలాంటి నిర్ణయం నాన్న చేసిన దారుణం వలనే తీసుకోవల్సి వచ్చింది! రాజు యాక్సిడెంటులో చనిపోయినా, సహజ మరణమైనా అయి వుంటే.. ఆ దుఃఖాన్ని తట్టుకొని రాజు కోరిక తీర్చటం కోసం.. 'మలయ సమీరం' నిర్మాణానికి నా జీవితాన్ని వెచ్చించే దాన్నేమో! ఉద్యోగం, వ్యాపారం ఏదీ వద్దనుకొని సొంత ఊరి మీద మమకారంతో వచ్చి.. నలుగురి కోసం ఏదో చేయాలని.. ఊరును ఆదర్శ గ్రామంగా అభివృద్ధి పరచాలనీ కలలు కని.. తపించిన రాజును బలి తీసుకొని... నేను నిశ్చింతగా ఎలా..ఎలా జీవించగలను బావా..?!

రాజు యాక్సిడెంట్‌లో చనిపోయాడని ఊరి వాళ్ళందర్నీ నాన్న నమ్మించగలిగి ఉండొచ్చు. చట్టం నుండి శిక్ష పడకుండా మాయోపాయంతో తప్పించుకుని ఉండొచ్చు! భగవంతుడు నాన్నకి ఏ విధంగా ఏ శిక్ష విధిస్తాడో తెలియదు గానీ... నేను మాత్రం నాన్నకి శిక్ష పడాలనే ఈ నిర్ణయం తీసుకున్నాను. అవును బావా..! ఏ కన్న కూతుర్ని మహారాణిగా నిలబెట్టాలని ఆస్తుల్ని కూడబెట్టటానికి వంచనకు పాల్పడ్డాడో... ఆ కూతురూ, ఆస్తులూ నాన్నకి దక్కకూడదు. కన్న కూతుర్ని పోగొట్టుకున్న క్షోభ.. నాన్న అనుభవించాలి! ఇది నా మాటగా నాన్నకి చెప్పు బావా!

ఈ విషయంగా అమ్మ, అత్తమ్మా, మామయ్య, అందరికీ వేదన కలిగిస్తున్నందుకు.. నిస్సహాయంగా రోదిస్తూ మన్నించమని వేడుకుంటున్నాను.

ఎవరిని చూసినా.. మాట్లాడుతున్నా ఆఖరికి ఇంట్లోని ఏ వస్తువును చూసినా కూడా రేపటి నుండి నాకేం సంబంధం ఉండదనే భావనతో మనసు బరువెక్కుతోంది!

ఇన్నేళ్ళుగా ఆటపాటలతో గడిపిన ఈ ఇంటిని... మీ అందరితో కలిసి ఎన్నెన్నో ఆనందాల్ని పంచుకున్న జీవితాన్ని వదిలి సెలవు తీసుకోవాలంటే చాలా ది..గు..లు..గా ఉంది బావా! అయినా తప్పదు!

సాయంకాలం నీరజతో కాసేపు బయట కూర్చున్నపుడు ఈ మాటే అన్నాను. "రేపు సూర్యోదయం ఉండదు. ప్రపంచం అంతా చీకటై పోతుంది! ఏ అలికిడీ ఉండదు.. ఆఖరుకు పక్షి కూతయినా వినబడని నిశ్శబ్దం ఆవరించుకుంటుంది చూడు...!" అని.

"రేపే యుగాంతం వస్తుందని జోస్యం చెబుతున్నావా?" అంటూ నీరజ నవ్వితే "అవును" అంటూ నేను పందెం కట్టి.. ఓడిపోతే నా ముత్యాలహారం ఇస్తానని అన్నాను. "ఎప్పుడు వస్తుందో తెలియదు గానీ రేపు మాత్రం ఖచ్చితంగా రాదని పందెం.." అంది. తమాషాకని నీరజ అనుకుంది. కానీ నా విషయంలో నిజమేగా..నా ప్రపంచం ఏ శబ్దమూ వినిపించని చీకటేగా! నీరజ కూడా పందెంలో గెలిచినట్లే! మరి తనకి అంతా యధావిధిగానే ఉంటుంది కదా! ఏ పందెంలోనైనా ఎవరో ఒకరే గెలుస్తారు. కానీ ఇక్కడ మాత్రం ఇద్దరం గెలిచినట్లే!

నీరజ కివ్వాలనుకున్న ముత్యాల హారాన్ని ముఖమల్ పర్సులో పెట్టి... నా బుక్ షెల్ఫ్‌లో ఉన్న పేము బుట్టలో పెట్టాను.

నా ప్రయాణానికి ఏర్పాట్లు హడావుడిగా మొదలు పెట్టాను.

నేను లేకపోయినా.. అత్తమ్మ, మామయ్యలు నేను పాడే కృష్ణ భజన, శివస్తోత్రం వింటూండాలని రికార్డు చేసి ఆ క్యాసెట్‌నూ ఆ పేము బుట్టలోనే పెట్టాను.

ఈ జీవితం.. అపురూప వరం... అని నేను అనుభూతి చెందేలా నన్ను పెంచిన అత్తమ్మా, మామయ్యలకు ఇంతకు మించి నేనేం ఇవ్వగలను..!

బావా.. చిన్నప్పటి నుండీ కూడా నువ్వంటే.. నాకు ప్రత్యేకమైన ఇష్టం, గౌరవం ఉన్నాయి ! నేను రాజుకు ఎలా దగ్గరయ్యానో... ఎందుకు మీ అందరి నుండీ దూరమైపోతున్నానో.. నా మనస్సు విప్పి నీకు చెప్పాలనే వివరంగా ఇంత పెద్ద ఉత్తరం రాస్తున్నాను. అత్తమ్మ, మామయ్యలను ఓదార్చి ధైర్యం చెప్పే బాధ్యత నీదే బావా!

అంతేకాదు.. ఇంకొక బాధ్యత కూడా నీకు అప్పగిస్తున్నాను.

నీ మనసులో చోటు సంపాదించుకున్న సుజన అదృష్టవంతురాలు. నేను చూడకపోయినా నువ్వు ఇష్టపడ్డ అమ్మాయి ఎలా ఉంటుందో ఊహించగలను! రాజు కోరిక 'మలయసమీరం' నిర్మాణాన్ని మీరిద్దరే చేపట్టాలి! మొదటి విరాళంగా నా పేరనున్న భూమిలో పది ఎకరాల్ని వినియోగించండి. ఆపైన అత్తమ్మ సలహా సహాయంతో ఎలా పూర్తి చేస్తారో... ఆ బరువు బాధ్యతలు మీవే!

నా పేరనున్న మిగతా భూమితో... మన ఇంట్లో పని చేస్తున్న వాళ్ళందరికీ సరిసమానంగా కానుకలివ్వాలి!

ఈ పనుల కోసం అవసరమౌతాయేమోననే ఉద్దేశ్యంతో నేను రెండు తెల్ల కాగితాలపై సంతకాలు చేసి బీరువాలో పెట్టాను. అవసరమైన దాని కోసం ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా నాన్న కూడా సంతకాలు చేయాల్సిందేనని నేను చెప్పిన చివర మాటగా చెప్పు బావా!

కన్న కొడుకును పోగొట్టుకున్న అరుంధతి అత్తయ్య దుఃఖాన్ని ఎవరూ తీర్చలేరు. అయినా నలుగురిలో ఉంటే... కొంతలో కొంతయినా సాంత్వనగా ఉంటుంది.. మన ఇంటికి తీసుకువచ్చి మీరే జాగ్రత్తగా చూసుకోవాలని కోరుతున్నాను. నా నోట మరణమనే మాట వచ్చినందుకే చలించిపోయి కన్నీళ్ళు పెట్టుకున్న అత్తయ్య.. ఇప్పుడు రాజు లేని లోటును ఎలా తట్టుకుంటుంది..?! ఊహించటానికే నాకు భయంగా ఉంది! బహుశా పిచ్చిదైపోతుందేమో..?!

ఆ రోజు నేను పరిహాసంగా అన్న మాటలు ఇలా నిజంగా నిజమవుతాయని అనుకోలేదు!

రాజు సహచర్యంలో స్వరాల సెలయేరులా సాగిపోతుందనుకున్న జీవితం ఇలా అర్థాంతరంగా ఆగిపోతోంది!

ఈ ఇంట్లో.. ఎవరూ నన్ను మర్చిపోరు.. నాకు తెలుసు.. అందరి మనస్సుల్లోనూ ఉంటాను!

కామాక్షి అత్తయ్య ఉదయం పూజ చేసుకునే సమయంలో... నేనూ రెండు నిముషాలు కళ్ళు మూసుకొని ధ్యానం చేస్తూ నిలబడటం అలవాటు కదా... అత్తయ్య ఆ సమయంలో ప్రతిరోజూ నన్ను గుర్తు చేసుకుంటుంది!

భోజనాల సమయంలో... తనతో సమానంగా అల్లరీ, హడావుడీ చేసే నన్ను కృష్ణ బావ నిశ్శబ్దంగా మనసులో తలచుకోకుండా ఎలా ఉండగలడు..!

సాయంకాలం పూట ఆరుబయట కూర్చునే నీరజకు .. తరలిపోతున్న మబ్బుల్లో నేను తప్పకుండా కనుపిస్తాను.. చెట్ల ఆకుల గలగలల్లో నా నవ్వులూ వినిపిస్తాయి!

మన భాష కాదనే సంశయంతో రంగా ఇష్టపడిన కన్నడ అమ్మాయితో పెళ్ళికి అభ్యంతరం చెప్పకుండా ఆనందంగా అంగీకరించమని నా సలహాగా శాంతమ్మకు చెప్పు బావా! ఇష్టపడి పెళ్లి చేసుకున్న వాళ్ళ ఆనందానికి.. భాష, కులం, మతం.. ఏవీ ఆటంకాలు కాలేవు! నిజమేగా బావా..?

ముత్యాలుకు.. మామయ్య శ్రీనిలయాన్నే ఇచ్చేసానని సరదాగా చెప్పారు! ఇప్పుడు నేను కూడా 'మలయసమీరం' తనదే అనుకుని కష్టపడి పని చేయమని అడుగుతున్నాను!

అమ్మ.. అమాయకురాలు.. నాన్న చెప్పింది చేయటమే తప్ప ఏమీ తెలియదు. అవసరమైనప్పుడు అమ్మకి నువ్వే అండగా నిలబడాలి మరి!

బావా అందరి దగ్గరా సెలవు తీసుకుంటుంటే.. కన్నీళ్ళు ఆగటం లేదు. ధారలు కట్టేస్తున్నాయ్! మరణమనేది మనకు తెలియకుండానే జరిగిపోవటం వేరు. అలా కాకుండా మనంతట మనమే బంధాల్ని తెంచుకుంటూ... ఆత్మీయుల దగ్గర్నుండి వీ..డ్కో..లు తీసుకోవటం... చాలా కష్టంగా ఉంది బావా! అయినా తప్పదు! ఇలా ఇష్టం లేని ప్రయాణానికి తప్పనిసరిగా నన్నిలా సన్నద్ధురాలిని చేసింది.. నాన్నే!

తన కూతురిని పై అంతస్థులో కూర్చోపెట్టి... మహారాణిగా చూడాలనే తాపత్రయంతో నాన్న ఇన్ని కుయుక్తులకు పాల్పడ్డాడు! చివరికి హత్య చేయించటానికీ వెనుకాడలేదు! ఇప్పుడు నాన్న తన జీవితాన్ని సంతోషంగా గడపగలుగుతాడా..? అడుగు బావా! కష్టపడి సంపాదించటానికి తన శక్తి సామర్థ్యాలని ఉపయోగిస్తే ఎంత బావుండేది! నాన్నని.. ఇదే.. అడుగుతున్నాను!

మా ఇంటి ఇనప్పెట్టి తాళాలు పొరపాటున నా హ్యాండ్ బాగ్‌లో వేసుకొని తెచ్చేసానని నిన్ననే చూసుకున్నాను. వాటిని నా టేబుల్ సొరుగులో పేపరు కింద జాగ్రత్త చేశాను.

ఇరవై ఏళ్ళలోనే.. నూరేళ్ళ జీవితానందాన్నీ పొందగలిగాననిపించేంత అల్లారు ముద్దుగా అపురూపంగా పెంచిన అత్తమ్మ, మామయ్యల ముందు ప్రణమిల్లి.. నన్ను మన్నించమని మరోసారి కోరుతున్నాను.

బావా.. వెళ్ళిరానా..

రావటమంటూ ఏం ఉంటుందని అనుకుంటున్నావా? మరుజన్మలనేవి ఉండటం నిజమైతే తప్పకుండా నేను మళ్ళీ మీ మధ్యకు వస్తాను!

బావా.. ఇక.. సె..ల..వ్!

శ్రీలక్ష్మి

విష్ణుతో పాటు నా కళ్ళూ చెమ్మగిల్లాయి రెండోసారి చదవటం అయినా!

**20**

విష్ణు ఏం మాట్లాడలేనట్లుగా కాసేపు అలాగే ఉండిపోయారు. తర్వాత ఆ ఉత్తరం నాకెలా వచ్చిందని అడిగారు. వివరంగా చెప్పాను!

"శ్రీలక్ష్మి ఆత్మ.. స్వామీజీ మాటలు.. నాకేం నమ్మకం లేకపోయినా దీని వెనుక కోదండంగారు ఉన్నారా అని అనుమానం వచ్చింది. ఆరోజు అవుట్ హౌస్ వరండాలో కూర్చుని ఆలోచిస్తోంటే.. కొన్ని విషయాలు గుర్తుకు వచ్చాయి. నేను శ్రీనిలయానికి వచ్చాక గురుస్వామి ఆ ప్లాటు అమ్మనని చెప్పటం... తర్వాత రజిత గృహ ప్రవేశం చేశాక.. మళ్ళీ మనకే ఇస్తానని అనటం... ఇదంతా కోదండంగారే అతనికి అదనంగా డబ్బాశ చూపించి నాటకం ఆడించారని... గురుస్వామి రజితకు చేసిన ఫోన్ కాల్‌ను అనుకోకుండా నేను వినటంతో నాకు తెలిసింది! నాది నష్టజాతకమని నిరూపిస్తే ఆయనకు ఒనగూడే లాభమేమిటో అప్పుడు అర్థం కాలేదు.

ఒకసారి కోదండంగారు రజితను "ఎవర్ని బయటకు పంపిస్తే ప్రయోజనం కలుగుతుందో వాళ్ళను పంపించాలి. గానీ.. పనిచేసే ముత్యాలునెందుకూ పంపించటం?" అని మందలించటం విన్నాను. స్వామీజీ నాటకం చూశాక.. నన్నే బయటకు పంపించాలని అప్పటి మాటలకి అర్థం తెలిసింది.

కానీ .. ఎందుకు.. దీని వలన ఏం ప్రయోజనం కలుగుతుంది?

నా సందేహాలకి సమాధానంగా అప్పుడు జరిగిన సంఘటన నిజంగా నా పాలిట వరమే అయింది!

నేను కూర్చున్న పెంకుల వసారా చివర కర్రల మధ్య పిచ్చుకలు గూడు పెట్టినట్లున్నాయి... మా అలికిడికి కాబోలు అవి కిచకిచమంటూ శబ్దం చేస్తుంటే.. ముత్యాలు వచ్చి చీపురుతో అదిలించి మళ్ళీ గది తుడవటానికి వెళ్ళి పోయింది. చీపురు

తగిలో, పిచ్చుకలు కదలటం వలనో తెలియదు గానీ.. పెంకు, గడ్డిపరకలతో పాటు ఒక కవరూ కింద పడ్డాయి. బాగా మాసిపోయి ఉన్న కవరును తీసి చూశాను. పోస్టు చేయని ఆ ఉత్తరం మీద మీ పేరే ఉంది. రామబ్రహ్మంగారి ఇంటి అడ్రసుకు శ్రీలక్ష్మి మీకురాసిన ఉత్తరమని అర్థమైంది.

చదివాక.. నా సందేహాలకు సమాధానాలు దొరికాయి.

మామయ్యగారికి కోదండంగారితో వ్యాపార విషయాలన్నీ చర్చించే అలవాటు ఉందిగా.. అది ఆయనకు బాగా ఉపయోగపడింది. మామయ్యగారు ఏదైనా సమస్య గురించి ఆలోచిస్తున్నప్పుడు స్వామీజీయే అది గ్రహించినట్లుగా రావటం.. సలహాలివ్వటం.. కోదండంగారి ద్వారానే జరిగేవన్నమాట! స్వామీజీ మహిమగా భ్రమపడి నమ్మకం పెంచుకున్న మామయ్యగారు... ఈ ఇల్లు అవీ.. మీ పేర పెట్టారు. అనుకోని విధంగా కృష్ణప్రసాద్ అల్లుడవటంతో... కోదండంగారు ఈ శ్రీనిలయం కృష్ణప్రసాద్ పేరుకు మార్పించే మార్గం గురించి ఆలోచించి... మనల్ని బయటకు పంపించే పరిస్థితి కల్పించాలనుకున్నారు.

మీరు మన పెళ్ళి ప్రస్తావన చేస్తూ ఉత్తరం రాసినప్పుడే శ్రీలక్ష్మి చనిపోవటం.. మామయ్యగారి ఆరోగ్యం పాడవటం... ఈ పరిస్థితులకు జతగా నేను రాగానే ఇంకా నష్టాలు జరిగాయని నమ్మించటం కోసం.. గురుస్వామితో నాటకం ఆడించారన్నమాట!

రజిత చాలాసార్లు తనకి అన్యాయం జరిగిందన్నట్లుగా మాట్లాడేది. అందుకేనేమో అప్పుడప్పుడు అసహనంగా ప్రవర్తించేది. పెద్ద కొడుకు మీద అభిమానంతో శ్రీనిలయం మీ పేర పెట్టారని రజితకు కోదండంగారు చెప్పి ఉంటారు. అందుకనే కాబోలు ఒకసారి 'మేనకోడలివి.. నీకు అన్యాయం జరిగితే మీ అత్తయ్య ఊరుకోదులే' అని రజితను అనునయించారు!

మనల్ని బయటకు పంపించటానికే మీరు లేని సమయంలో స్వామీజీని రప్పించారు. తను కూడా లేకపోతేనే.. తనకేం తెలియనట్లుగా ఉంటుందనీ, కృష్ణప్రసాద్‌తో ప్రయాణం పెట్టించి కూడా తనూ వెళ్ళారు.

కోదండంగారు చెప్పిన ఇంట్లో జరిగిన విషయాలేవో స్వామీజీ చెప్పేసరికి అత్తయ్య వాళ్ళంతా ఆయన మహిమగా ఆశ్చర్యపోయి ఉంటారు. స్వామీజీ అటు తిరిగి కూర్చున్నా గానీ, రెండు వైపులా కనిపించేట్లే ఆయనకు విసురుతున్న శిష్యులు కూర్చున్నారు.

వాళ్ళే నా రాకను... ముందే అనుకున్న ఏ సంకేతం ద్వారానో తెలియజేస్తే.. అదీ స్వామీజీ మహిమగా అందరూ భ్రమపడ్డారు! ఏం ఉందీ... నేను రాగానే విసరటం ఆపేయటమనే గుర్తుపెట్టుకున్నా సరిపోతుందిగా!

స్వామీజీ మహిమల్ని చూసిన ఇంట్లో వాళ్ళకు... ఆత్మ ద్వారా ఆయన చెప్పిన మాటలూ నిజమేనేమోననే భ్రాంతి ఆ సమయంలో కలగటం సహజమే! నేను కూడా అందుకే అందరి ఆందోళనని గమనించి బయటకు వచ్చేశాను. అనుకోకుండా అవుట్ హౌస్‌కి వెళ్ళటం.. శ్రీలక్ష్మి ఉత్తరం కనుపించటంతో నిజాలు తెలిసాయి.

ఆ ఉత్తరం అత్తయ్యకు చూపిస్తే సరిపోతుంది. కానీ ఆత్మ అంటూ వంచించిన వాళ్ళని నేనూ ఓ ఆట ఆడించాలనే కోరికతో .. స్వార్థంతో ప్రవర్తించిన కోదండం గారికి ఘాటుగా సమాధానం చెప్పాలనే కోపంతో ఆయన ఉపయోగించిన శ్రీలక్ష్మి ఆత్మ అనే ఆయుధాన్నే నేనూ నా చేతిలోకి తీసుకున్నాను. ఉత్తరంలోని సంగతుల్నే సందర్భానుసారంగా చెబితే.. ఇంట్లో వాళ్ళంతా నమ్మేశారు. అందుకే ఆ జగ్గడు కోదండంగారి ద్వారా తెలుసుకున్న విషయాలను చెప్పి.. మహిమగల స్వామీజీగా పేరు సంపాదించి.. మామయ్యగార్నీ, ఊళ్ళోవాళ్ళనీ తేలికగా నమ్మించగలిగాడు.

కృష్ణప్రసాద్ తన ఫ్రెండ్‌కి ఆత్మల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉందని నా దగ్గరకు తీసుకు వస్తానంటే.. అప్పుడు అసలు విషయం చెప్పేద్దామా అనుకునీ మళ్ళీ ఆ ఆలోచన విరమించుకున్నాను. శ్రీలక్ష్మి ఆశయం నెరవేరాలంటే.. కోదండంగారి అనుమతి అవసరమవుతుందనిపించి.. ఆయన సంతకాలు తీసుకునే వరకూ ఎవరికీ ఈ సంగతి తెలియపరచక పోవటమే మంచిదనిపించింది. నయానమాట వినని వాళ్ళని భయపెట్టటమే మార్గం అనుకున్నాను.

ఇంట్లో విషయాలు అందరికీ తెలియటం ఇష్టం లేదంటూ.. కృష్ణప్రసాద్ ఫ్రెండ్‌కి ఈ ఆత్మ వ్యవహారం నిజం కాదని నేను చెప్పమనటం రజిత విని నా మీదకు ఎదురు దాడి చేయాలనే ఉద్దేశంతో.. శ్రీలక్ష్మి ఆత్మ తనకీ కనిపించిందంటూ మొదలు పెట్టింది. ఆ మాటలకు రుజువుగా ముత్యాలును నమ్మించటానికి ప్రయత్నం చేసింది! పాపం తనకేం తెలుసూ, నేనిలాంటి తిరుగులేని ఆయుధాన్ని నా దగ్గరుంచుకున్నానని!

కాగితాల మీద సంతకం చేయటానికి కోదండం గారు ఒప్పుకోకపోతే... నేను ఆయనకీ వినిపించేట్లుగా.. శ్రీలక్ష్మి ఆత్మ చెప్పమంటోందంటూ.. గురుస్వామికి అదనంగా

డబ్బు ఆశ చూపి స్థలం విషయంలో అబద్ధం చెప్పించటం... రాజుది యాక్సిడెంట్ కాదని తన మనుష్యులతో మరిడిమ్మ బావి దగ్గర హత్య చేయించిన విషయం.. జగ్గడిని జోగీంద్ర స్వామిగా మభ్యపెట్టిన వైనం... అన్నీ తెలుసునని అనటంతో ఇక లాభం లేదనుకుని సంతకాలు చేసేశారు!

కొందరికి కొన్ని అతీత శక్తులుండడం నిజమే కావచ్చునేమో! కాని చాలా మంది మాత్రం మహిమల పేరుతో ప్రజల్ని మభ్యపెట్టే వాళ్ళే! ఏ పుట్టలో ఏ పాముందో అనే నమ్మకంతో జనం ఎక్కడ ఏ విడ్డూరం కనిపించినా, ఆధ్యాత్మికత పేరుతో జాతకాలు చెబుతామన్నా దాసోహం అయిపోతారు! ఈ నమ్మకాల్ని ఆధారం చేసుకుని డబ్బు సంపాదించే వాళ్ళు అందుకే పెరిగిపోతున్నారు!

ఏదైనా ప్రయోజనకరమైన వ్యాపకం ఉండాలని కోరుకుంటున్న నాకు.. శ్రీలక్ష్మి ఒక మంచి మార్గాన్ని చూపించింది. తన ఉత్తరం చదువుతోంటే.. కొన్ని చోట్ల నా మనసులోని మాటల్నే శ్రీలక్ష్మి చెబుతున్నట్లుగా అనిపించింది! నేనెప్పుడూ చూడకపోయినా, పరిచయం లేకపోయినా.. శ్రీలక్ష్మి నాకు ఆప్తురాలైనట్లుగా ఆత్మీయ భావన కలిగింది! ఎంత కష్టమైనా సరే... ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఎదుర్కొని 'మలయ సమీరం' నిర్మించాలని గట్టిగా అనుకున్నాను. అత్తయ్య, మీరు అభ్యంతరం చెప్పకుండా సహకరిస్తారని నాకు తెలుసు. అందుకే నేను అనుకుంటున్న ఒక ప్రాజెక్టుకు ఒకరు పదెకరాలు వాగ్దానం చేసారని.. శ్రీలక్ష్మి పొలాన్ని దృష్టిలో పెట్టుకునే మీతో అలా చెప్పాను. మిమ్మల్ని, నాన్నగార్ని సంప్రదించి అమ్మ ద్వారా వచ్చిన ఆస్తి, నగల్ని కూడా దీనికోసమే ఖర్చు పెట్టాలని నా ఉద్దేశ్యం. 'మలయ సమీరం' వృద్ధాశ్రమంలో కేవలం పెద్ద వాళ్ళనే కాకుండా, ఎవరూ లేని అనాధ పిల్లల్ని కూడా చేర్చుకుంటే బావుంటుంది! పెద్దలూ, పిల్లలూ కలిసి కుటుంబాలుగా ఉంటారు. ఆశ్రమానికి అనుబంధంగా ఒక స్కూలు, హాస్పిటల్ కూడా ఉండాలి! నా ఆలోచన ఎలా ఉంది...?"

విష్ణు ప్రశంసగా చూసి ఆలోచిద్దాం అన్నట్లుగా తల ఊపారు.

విష్ణు మాత్రమే కాదు. అత్తయ్య అందరూ కూడా ఆనందంగా అంగీకరిస్తారు... శ్రీలక్ష్మి ఆఖరి కోరిక కదా!

"శ్రీలక్ష్మి ఈ ఉత్తరాన్ని ఎందుకు పోస్టు చేయలేదు..? అవుట్ హౌస్ చూరులోకి ఎలా వెళ్ళింది..?" సాలోచనగా అన్నారు.

“ఉత్తరం ముందు ఆతృతగా చదివేశాక... నాకూ ఈ సందేహం వచ్చింది. ముత్యాలును శ్రీలక్ష్మి గురించి అడుగుతూ.. చనిపోయిన ముందు రోజు ఎలా ఉందీ... ఏం చేసిందీ అని వివరాలు ఆరాగా అడిగినప్పుడు తను చెప్పిన మాటల్లోనే నాకు ఆధారం దొరికింది! ఆరోజు తొందరగా భోజనం చేసేసి తన గదిలోకి వెళ్ళిపోయిన శ్రీలక్ష్మి రాత్రి తొమ్మిదింటికి ముత్యాలుకు కవరు ఇచ్చి పోస్టు బాక్సులో వేయమని చెప్పింది. అవుట్ హౌస్ పక్కనున్న గుమ్మం నుండి వెళ్తే అక్కడే డబ్బా ఉంటుంది గదాని ఇటు వస్తున్న ముత్యాలను రుక్మిణమ్మగారు నవారు మంచం బిగించటానికి సాయం రమ్మని పిలిచారు. ఆవిడ లోపలకి వెళ్ళి మంచం తెచ్చే లోపున ఈ ఉత్తరాన్ని తర్వాత పోస్టు బాక్సులో వేద్దామని ముత్యాలు అక్కడ చూరులో పెట్టి... ఆ తర్వాత మర్చిపోయి పడుకోవటానికి వెళ్ళిపోయి ఉంటుంది. ముత్యాలు ఒక్కోసారి ఎప్పటివో సంగతులు చెబుతూ ఉంటుంది గానీ ఒక్కోసారి అప్పుడు చెప్పిన పనినే మరిచిపోతూంటుందని తెలుసుకదా! రుక్మిణమ్మగారు కూడా ముత్యాలు చేతిలోని కవరు చూసి ఉండరు. నేను రెండు మూడు సార్లు శ్రీలక్ష్మి ఇచ్చిన కవరును డబ్బాలో వేశావా?’ అని తరిచి అడిగినా తనకి జ్ఞాపకం రాలేదు. ‘వేయకుండా ఎందుకుంటానూ’ అంది. ముత్యాలు మాటల్ని బట్టీ ఇదీ జరిగిన సంగతని నాకు అర్థమైంది!” అన్నాను.

“అవును.. అలాగే జరిగి ఉంటుంది..” విష్ణు అంగీకరించారు.

“సరిగ్గా ఆ సమయంలో.. దేముడు అనుగ్రహించినట్లుగా శ్రీలక్ష్మి ఉత్తరం నా చేతిలో పడటం వలన కోదండం గారికి తగినట్లుగా సమాధానం చెప్పగలిగాను!” నిట్టూరుస్తూ అన్నాను.

విష్ణు చిరునవ్వు నవ్వారు. “నువ్వు పైకి కనిపించేంత మెత్తన కాదు! నీలో ఛమక్ చాలా ఉంది! ఒకటికి రెండింతలు బదులు తీర్చుకున్నావు!”

“నిష్కారణమైన నిందారోపణల్ని భరించాల్సి రావటం... ఎంత ఆవేదననీ, అవమానాన్నీ కలిగిస్తుందో నాకు తెలిసింది. ఆ అవమానాన్నీ, బాధను అనుభవించాను కాబట్టి నాకు లభించిన అవకాశాన్ని వదిలిపెట్టబుద్ధి కాక.. కోదండంగారు నా మీదకు విసిరిన ఆయుధాన్ని అందుకుని తిరిగి ఆయన మీదకే ప్రయోగించాను! అత్తయ్యను.. అందర్నీ కూడా మభ్యపెట్టినందుకు... అపార్థం చేసుకోవద్దని మీరే నచ్చచెప్పాలి. ఆ బాధ్యత మీదే...!” అన్నాను.

శ్రీలక్ష్మి తన ప్రేమ గురించి చెప్పిన తర్వాత... రాజు మాటలు గుర్తుకొచ్చి నవ్విందే తప్ప తమాషా చేయటం కాదని తెలిసి విష్ణుకూ మనసు తేలికపడినట్లయింది!

* ❀ *

ఉత్తరం చదివాక అసలు నిజాలు అందరికీ తెలిసాయి. శ్రీలక్ష్మి కోరిక 'మలయ సమీరం' నిర్మాణానికి అందరూ ఉత్సాహం చూపించారు. నా అభిప్రాయాల్నీ ఆనందంగా అంగీకరించారు. ఊరికి కొంచెం దూరంగా తన పేరనున్న ఆరు ఎకరాలు భూమినీ అత్తయ్య ఇస్తానని అనటంతో 'ఎక్కడ' అనే ప్రశ్న తీరిపోయింది.

శ్రీలక్ష్మి సిబ్బంది అందరికీ కానుకగా ఇచ్చిన... వాటాని శాంతమ్మ, ముత్యాలు కూడా విరాళంగా ఇచ్చేస్తానని అనడం నిజంగా గొప్ప విషయం! అందరం ఉన్న దానిలో నుండి కొంత మాత్రమే ఇచ్చాం గానీ వాళ్ళిద్దరూ తమకున్నదంతా ఇచ్చేసినట్లే. కొద్ది మొత్తమైనా వాళ్ళ విరాళాలే ఘనం!

స్కూలు స్థాపన గురించి చెప్పినప్పుడు ఆ బాధ్యతను స్వీకరించడానికి నాన్నగారూ, నారాయణరావు గారూ అంగీకరించటం శుభ పరిణామం అనిపించింది. నాన్నగారి పర్యవేక్షణ, నారాయణరావుగారి తోడ్పాటు ఉంటే ఇంకేం ఆలోచించనక్కర్లేదు... నిశ్చింతే!

గురుస్వామి దగ్గర్నుండి కొన్న ప్లాటులో కృష్ణప్రసాద్ కట్టాలనుకుంటున్న హాస్పిటల్‌తో పాటు 'మలయ సమీరం'లోని హాస్పిటల్ నిర్వహణా చూస్తానని అన్నాడు. హాస్పిటల్ నిర్మాణం, నిర్వహణ పూర్తిగా, రంగా, కృష్ణప్రసాద్‌లదే అని నిర్ణయించాం. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం గురించి వెతుక్కోవలసిన అవసరం లేకుండా.. ఒక యజ్ఞం లాంటి మంచి పనిలో పాలు పంచుకునే అవకాశం లభించటం నిజంగా తన అదృష్టమని రంగా అన్నాడు.

కృష్ణప్రసాద్ హాస్పిటల్ శ్రీనిలయానికి దగ్గిర కాబట్టి శ్రీనిలయం అతనికే చెందేటట్లుగా, మేం 'మలయ సమీరం'కి దగ్గరగా ఇల్లు కట్టించుకోవటానికి నిర్ణయించుకున్నాం. అత్తయ్య అంగీకరించి మాతో పాటు తామూ వస్తామని అన్నారు. అంతకన్నా ఆనందం ఇంకేముంటుందీ అనిపించింది!

మామయ్యగారి ఆరోగ్యం క్రమేపీ మెరుగుపడుతోంది. తొందరలోనే పూర్తిగా ఆరోగ్యం చేకూరుతుందని డాక్టర్లు అన్నారు. మామయ్యగారికి ప్రతీరోజూ శ్రీలక్ష్మి పాటల్ని వినిపిస్తున్నారు. మామయ్యగారి ఆరోగ్యానికి ఆ పాటల ప్రభావమే ఎక్కువ అనుకుంటాను!

అరుంధతమ్మ గారిలోనూ ఆశ్చర్యంగా మంచి మార్పే వచ్చింది. విషయాలన్నీ ఆమెకూ అవగతమయ్యాయి. మందుల వాడకంతో పాటు ఇంట్లో వాళ్ళంతా అభిమానంగా, జాగ్రత్తగా చూసుకోవటం కూడా ఆమె ఆరోగ్యం బాగుపడటానికి దోహద పడింది. తన కొడుకు జ్ఞాపకార్థంగా వెలిసే 'మలయ సమీరం'లోనే తన నివాసమూ అని చెప్పారు.

ఇక కోదండం గారి సంగతి, హాస్పిటల్ నుండి డిస్చార్జి అవటానికి ముందు రోజే ఎవరికీ తెలియకుండా, చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయారు. ఆ తరువాత ఎక్కడి నుండో ఫోను చేశారు.. తన శేష జీవితాన్ని ఏదో ఆశ్రమంలో గడపదలుచుకున్నానని. అడ్రసూ, వివరాలు మాత్రం చెప్పలేదు.

నేను, విష్ణు చెన్నూరు వెళ్లి విష్ణు అత్తయ్యకు ధైర్యం చెప్పాం. వినుత పెళ్ళి బాధ్యత తనదేనని విష్ణు అన్నారు. వినుత పెళ్ళి అయ్యాక తను కూడా 'మలయ సమీరం'కు వచ్చేసి నిర్వహణా బాధ్యతల్లో పాలు పంచుకుంటానని విష్ణు అత్తయ్య చెప్పటం.. ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కలిగించింది!

ముత్యాలు హుషారు చెప్పనే అక్కర్లేదు! శ్రీనిలయంలాగే మలయ సమీరం కూడా తనదేనని సరదాగా చెప్పుకోవటమే కాదు. నిర్మాణం మొదలు పెట్టగానే తన మకాం అక్కడేనని హడావుడి చేస్తోంది.

శ్రీలక్ష్మి తల పెట్టిన మంచి పనికి ఇలా ఎంత మందో స్వచ్ఛందంగా తమ సహాయ సహకారాల్ని అందిస్తున్నారు!

* ❀ *

విష్ణు శ్రమకు ఫలితం కనిపించింది. బిజినెస్ వ్యవహారాలన్నీ ఒక గాడిలో పడ్డాయి. కొంచెం తీరుబడి దొరకటంతో అనుకున్నట్లుగా ఇద్దరం నాన్నగారి దగ్గరకు వెళ్ళాం. చాలానాళ్లకు ఇద్దరం కలిసి ప్రయాణం చేయటం... అదీ నాన్నగారి దగ్గరకే అవటం.. నాలో ఉత్సాహం ఉరకలు వేసింది! పెళ్ళయిన తర్వాత మొదటిసారి పుట్టింటికి వెళ్తున్నప్పుడు ఆడపిల్లకు కలిగే అపురూపమైన ఆనందం.. నాకూ అనుభవమైంది!

నాన్నగారు, నాన్నమ్మ, నేను, విష్ణు.. అందరం కూర్చుని కబుర్లు చెప్పుకోవటం.. కలిసే భోజనాలు చేయటం.. ఎంత ఆనందమో!

మేం ఇద్దరం ఆ చుట్టు పక్కల ప్రదేశాలన్నీ కూడా చూసి తిరుగు ప్రయాణమయ్యాం. వారం రోజులూ క్షణాల్లా గడిచిపోయాయి.

ఇంటికి తిరిగి వచ్చిన రోజు అత్తయ్య గుమ్మం దగ్గరే ఎదురయ్యారు.

నాకు అప్రయత్నంగా... మేమిద్దరం నూతన వధూవరులుగా శ్రీనిలయానికి వచ్చిన రోజు గుర్తుకు వచ్చింది.

అప్పుడు అత్తయ్య చూపుల్లో ఏదో నిర్వేదం... నిర్లిప్తత...!

ఇప్పుడు అత్తయ్య .. అహా.. కాదు ... అత్తమ్మ చూపుల్లో.. అభిమానం .. ఆప్యాయత, ఆహ్వానం కనిపిస్తున్నాయి.

నాకు చాలా సంతృప్తిగా, ఆనందంగా మనసు నిండిన అనుభూతి కలిగింది!

❊ ❀ ❊

నాకు ఆరో నెల వచ్చింది. స్కానింగ్‌లో అమ్మాయని తెలిసి.. అత్తమ్మ సంబరం అంతా ఇంతా కాదు! 'మా శ్రీలు మళ్ళీ మా మధ్యకే వచ్చేస్తోంది..'' అని ఉప్పొంగిపోతున్నారు! మరణించిన ఆత్మీయులు మళ్ళీ తమ మధ్యకి పిల్లలుగా వస్తారని అనుకోవటం.. ఆనందకరమే! ఎవర్నీ నొప్పించని నమ్మకాల పట్ల అభ్యంతరమేమీ ఉండదు. నష్టజాతకం, కోడలొచ్చిన వేళ.. మనసుల్ని గాయపరిచే ఇలాంటి మాటలకు నమ్మకాలకు స్వస్తి చెప్పాల్సిందే! 'వెధవముండ' అనే మాట ఎంత అవమానకరం! భర్తను పోగొట్టుకున్న స్త్రీ దురదృష్టవంతురాలే గానీ హత్య చేసిన హంతకురాలు కాదుగా... ఎదురొస్తే చెడు జరగుతుందని అనుకోవటానకి! పరిస్థితులు, అవసరాల్ని బట్టి కట్టు, బొట్టు, అలవాట్లు.. అన్నీ మార్చుకుంటున్నాం.. అయినా ఇంకా కొంతమంది.. ఎంతో ఆధునికమైన వేషభాషలతో కనుపించే వాళ్ళే 'వెధవముండ శకునం' అనటం విని నిర్ఘాంతపోయాను! ఆ మాటనూ పూర్తిగా తొలగించాలి!

ఏ మనిషి శకునమైనా అశుభమని నిర్ణయించే హక్కు ఎవరికీ లేదు!

ఇంకో ఆనందకరమైన సంగతి ఏమిటంటే... నీరజకు పెళ్ళి నిశ్చయమైంది. హాస్పిటల్ స్టాఫ్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నప్పుడు జయశంకర్ అనే డాక్టరు అందరికీ నచ్చాడు. అన్ని విషయాలూ కూడా కలవటంతో పెళ్ళి నిశ్చయమైంది. ఈ పనుల హడావుడి కొంత తగ్గాకనే పెళ్ళి ముహూర్తం నిశ్చయించాలని అనుకున్నారు.

'మలయ సమీరం' దగ్గరగానే డాక్టర్లు, ఇతర సిబ్బందికీ, టీచర్లకు క్వార్టర్సు కట్టించాలని అనుకున్నాం. పెళ్ళయ్యాక ఎక్కడికో దూరం వెళ్ళకుండా మా అందరికీ దగ్గరగానే ఉంటుంది కాబట్టి నీరజకూ సంతోషంగా ఉంది.

అత్తయ్య నాకు ఇచ్చిన శ్రీలక్ష్మి నగలు విష్ణు తీసుకువచ్చారు. ఈసారి అత్తయ్య తనే స్వయంగా నాకు ఇచ్చారు. ఆ నగల వెనక అత్తయ్య అభిరుచి, శ్రద్ధ ఉన్నాయి. నగల పట్ల నాకు ఆసక్తి లేకపోయినా అత్తయ్య మనవరాలికి అందించాల్సిన బాధ్యత ఉందని అనటంతో అత్తయ్య మాట ప్రకారం తీసుకున్నాను.

❊ ❀ ❊

సూర్యాస్తమయ శోభని చూస్తూ వెనుక బాల్కనీలో మెల్లగా పచార్లు చేస్తున్నాను.

"సుజీ.." విష్ణు పిలుపుకు తిరిగి చూశాను. ఎందుకనో ఆ రోజు తొందరగా వచ్చేశారు.

"క్యా..జీ.."సరదాగా అంటూ దగ్గరకు వెళ్లి "రవి గారు ఇంటికి చేరుకుంటున్న సమయానికే సరిగ్గా మీరూ వచ్చేశారే.. ఏమిటి విశేషం?" అడిగాను.

"ఏం చేయనూ... సుజన.... సుజన.. అని మనసు చేసే భజన మితిమీరి పోతోంటే.. వచ్చేశాను.." అంటూ భూజాలెగురేశారు.." ఇకనుండీ ఇంటికి తొందరగా వచ్చేస్తూ.. నిన్ను జాగ్రత్తగా చూసుకోవాలని అమ్మ ఆర్డరు కూడా వేసిందిలే..!"

"అవును.. అత్తమ్మ చాలా గారాబం చేసేస్తున్నారు. నన్ను క్రిందికి దిగి రావద్దంటూ అన్నీ పైకి పంపించేస్తున్నారు! డాక్టర్లేమో నడకే మంచిందంటారు... అందుకే ఇక్కడే ఇలా తిరుగుతున్నాను."

ఇద్దరం గదిలోకి వచ్చాక... బెడ్ మీద వెనక్కి ఆనుకుని స్థిమితంగా కూర్చుని విష్ణు నాతో "మీ నాన్నమ్మ గారినీ, నాన్నగారినీ ఇక్కడకోసారి రమ్మనమని అమ్మ పిలవమంటోంది" అన్నారు.

"డెలివరీ టైముకి వస్తామని అన్నారు" అన్నాను. అంతలో నాకో ఆలోచన వచ్చింది.

"పుట్టబోయే పాపకి శ్రీలక్ష్మిలోని మొదటి అక్షరాన్నీ, మా అమ్మపేరులోని చివరి అక్షరాన్ని కలిపి 'శ్రీజ'గా పేరు పెడితే ఎలా ఉంటుందీ.. బావుంటుంది కదూ!"

విష్ణు కోపాన్ని అభినయిస్తూ వేళాకోళంగా "అంతా నీ ఇష్టమేనా..? పెద్దవాళ్ళున్నారుగా, అత్తగారంటే.. నీకు బొత్తిగా భయం భక్తి లేకుండా పోయింది!" అన్నారు.

"నిజమే.. అత్తగారంటే భయం... రవ్వంతే, అభిమానం, గౌరవమే మరింత!" అన్నాను చిరునవ్వుతో.

"మరి నేనంటే..?" ప్రశ్నార్థకంగా చూశారు.

విష్ణుని అనుకరిస్తూ చూపుడు వేలితో గాలిలో రాశాను.

"ప్చ్.." అన్నారు అర్థం కాలేదన్నట్లుగా.

విష్ణు భుజాలపై చేతులు వేసి "మీరంటే భయం రవ్వంత కూడా లేదు! అంతా.. మనసంతా అనురాగమే.. హద్దుల్లేని ముద్దూ మురిపమే!" అంటూ నవ్వేశాను.

విష్ణు నావేపు ఇష్టంగా చూసి నా చెంపలపై చేతులు వేసి దగ్గరకు తీసుకొని నా నుదురు మీద తన పెదవులు ఆనించారు.

నా మాటల భావాన్నే విష్ణు కూడా చెప్పకనే చెప్పినట్లయింది!

ఆ క్షణాలలో.. ఒక మృదు మధురభావన మలయసమీరంలా మనసును అలరించింది!